# బాధ్యత

- ఎం.నాగలక్ష్మి

"ఉషా"

మెల్లిగా నీర్సంగా విన్పిస్తున్న కంఠాన్ని ఇట్టే పోల్చుకుంది ఉష.

"సౌజన్యా" గట్టిగా అరిచేసింది ఉష. "ఎన్నాళ్ళయిందే నీ దగ్గరనుంచి ఫోన్ వచ్చి, యుగాలయింది అన్పిస్తోంది. నేను చేసినా ఏం ఉలకవు పలుకవు. అన్నిటికీ 'ఆ' 'ఊ'లతో సరిపెడ్తావు. ఎలా ఉన్నావు? దీప్తి ఎలా ఉంది?"

"ఉషా నువ్వు నాకో సహాయం చేయాలి. చేస్తావా?" ఉష మాటల్ని మధ్యలోనే తుంచుతూ అంది సౌజన్య.

"తప్పకుండా.. ఏం చేయను చెప్పు." కాస్త సందేహంగానే అడిగింది ఉష.

"నేను కొన్నాళ్ళు నీతో ఉంటాను. ఉండవచ్చా? దీప్తితో పాటు.. నేను విడిగా అకామడేషన్ చూసుకునే వరకూ... అలాగే మీ స్కూల్లో నాకేదైనా పని దొరుకుతుందేమో చూడగలవా?"

ఇటువైపు నుంచి వింటున్న ఉష మొహం రంగు మారిపోయింది. తను సరిగ్గా వింటున్నదా లేక భ్రమిస్తోందా అన్న అనుమానం కూడా వచ్చింది.

"ఏయ్ సౌజన్యా, ఏమయింది? ఇలా మాట్లాడతున్నావు. ప్రదీప్‌తో ఏమైనా గొడవపడ్డావా..." సౌజన్య, ప్రదీప్‌ల మధ్య గొడవలు రావడమా? ఇంపాజిబుల్... వాళ్ళిద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' ఇద్దరూ సుగుణాల రాసులే. ఉన్నతమైన సంస్కారం కలవాళ్ళే. కాకపోతే కాలం వాళ్ళని ఘోరంగా కాటేసింది. దాని ప్రభావం వల్ల ఇలా...

"అన్నీ నేను నీదగ్గరికి వచ్చాక చెప్తాను. ముందిది చెప్పు నేను నీ దగ్గర కొన్నాళ్ళు ఉండడానికి వీలవుతుందా లేదా.."

"అదేంమాట సౌజన్యా. నాకేం అభ్యంతరం లేదు.. నీకు ఎప్పుడు రావాలంటే అప్పుడు వచ్చెయ్యి. ముందుగా చెప్తే నువ్వు వచ్చే టైముకి ఇంట్లో ఉంటాను.." ఉష అన్యమనస్కంగా అంది మనసులో ఏదో ఆలోచిస్తూ.

"థాంక్యూ.. మళ్ళీ ఓ రెండు రోజుల్లో ఫోన్ చేస్తాను" సౌజన్య ఫోన్ పెట్టేసింది.

సౌజన్య ఎందుకిలా మాట్లాడుతోంది? ఇల్లు వదిలి తన దగ్గర ఎందుకు ఉండాలనుకుంటోంది? ఉషా, సౌజన్యా చిన్నప్పటి స్నేహితులు. ఇంచుమించు డిగ్రీదాకా కలిసే చదివారు. ఉషకి తల్లీ, తండ్రీ, అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ అందరూ ఉన్నా, పెళ్ళి చేసుకోమని పోరినా తనకిష్టం లేదని ఓ స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం చేస్తూ ఒంటరిగానే ఉంటోంది. సౌజన్య పాపతో వస్తే ఇంట్లో సందడే. తనకేం ఇబ్బంది లేదు. కానీ.. తల్లీతండ్రీ తోబుట్టువులు ఎవరూ లేక బాబాయిగారింట్లో ఇంచుమించు అనాథలా పెరిగిన సౌజన్యని ప్రదీప్ ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. సౌజన్య అదృష్టానికి ఎంతోమందికి కళ్ళు కుట్టాయి. ప్రదీప్ ఎంత అందగాడో అంత ఆస్తిపరుడు. అంతేకాకుండా ఎంతో ఉత్తముడు. సౌజన్యని ఎలా వదుల్చుకోవాలా అని చూస్తున్న ఆమె బాబాయిగారి పరివారానికి ఓ చక్కని సాకు దొరికింది. ప్రదీప్‌ని పెళ్ళి చేసుకుంటే ఈ గడప మళ్ళీ తొక్కవద్దు అని వార్నింగ్ ఇచ్చేశారు. ఎందుకంటే ప్రదీప్‌వి వాళ్ళకన్నా తక్కువ కులం కాబట్టి. తన ముగ్గురు కూతుళ్ళకి పెళ్ళి చేయకుండా, తనకు పెళ్ళి చేస్తారని సౌజన్యకేమాత్రం నమ్మకమూ లేదు. కేవలం సమాజం కోసం అన్న కూతుర్ని వదిలేశారు అన్న అప్రతిష్ట రాకుండా ఉండడం కోసం మాత్రమే తననా ఇంట్లో ఉండనిస్తున్నారు అన్నది సౌజన్య ఊహ వచ్చినప్పటి నుంచి గ్రహించిందే. అందుకే అయిదేళ్ళుగా సౌజన్య చదివే కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూ మంచిపేరు ఉన్న ప్రదీప్ చేయి పట్టుకోవడానికి వెనుకాడలేదు.

* * *

సౌజన్య తన బట్టలు, దీప్తి బొమ్మలు సూట్‌కేసుల్లో సర్దుతోంది. సర్దడానికేముంది కనక.. కొన్ని బట్టలు తీసుకుంటే చాలు.. వెనక నుంచి అలికిడి విన్పించి సర్దడం ఆపి దీప్తి ముందు కూర్చుంది సౌజన్య. ఇలా పడుకున్నది అప్పుడే లేచిపోయింది దీప్తి. తన ముందున్న రబ్బరు బొమ్మని పట్టుకోవడానికి మెలికలు తిరుగుతూ అవస్థపడుతోంది. బొమ్మ చేతికి చిక్కదు.. అందినా దాన్ని గట్టిగా పట్టుకునే ధృడత్వం దీప్తి చేతుల్లో లేదు. ఎన్నాళ్ళయింది తను మధ్యాహ్నం పడుకుని.. రోజూ దీప్తి ఇలాగే పాకుతూ, డేకుతూ, మెలికలు తిరుగుతూ ఎప్పటికో నిద్రపోతుంది. అప్పటికి తన నిద్ర సమయం దాటిపోతుంది. దీప్తి పడుకున్నప్పుడే ఇంట్లో పని కాస్త చేయగలుగుతుంది. దీప్తి మేలుకుని ఉన్నంతసేపు తను దీప్తి ముందర అలా కూర్చునే ఉంటుంది. సౌజన్య సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలని అదుపులో పెట్టాలని శతవిధాలా ప్రయత్నించి విఫలమైపోతోంది.

జీవితం ఎంత విచిత్రమయినది.. ఆరేళ్ళు పిల్లలు లేరు అని తనూ, ప్రదీప్ ఎంత బాధపడ్డారు. డాక్టర్ల చుట్టూ, బాబాల చుట్టూ తిరిగి ముక్కోటి దేవుళ్ళకీ పేరు పేరునా మొక్కుకుని విసిగి, వేసారి ఆఖరికి అనాధాశ్రమంలోంచి ఓ పాపని తెచ్చుకోవడానికి నిశ్చయించుకున్నారు.

ఆరోజు... ఆరోజు అనాధాశ్రమంలో అందరి పిల్లల్నీ ఎంతో జాగ్రత్తగా, సునిశితంగా పరిశీలించి.. ఆఖరికి మిలమిలా మెరిసిపోతున్న నెల కూడా దాటని ఓ పసిగుడ్డుని ఎంపిక చేసుకున్నారు. వెలుగులు విరజిమ్ముతున్నట్టున్న పాపకి 'దీప్తి' అని పేరు పెట్టి ఫ్రెండ్స్‌ని, చుట్టాలనీ పిల్చుకుని వేడుకలు జరుపుకున్నారు.

రెండు, మూడు నెలలు ఎంతో ఆనందంగా గడిచిపోయాయి. కానీ.. మెల్ల మెల్లగా.. విధి తమని ఎంత క్రూరంగా కాటువేసిందో అర్థమయి నిశ్చేష్టులయ్యారు. బెంబేలెత్తిపోయారు. సౌజన్య కళ్ళు గాజుకళ్ళుగా మారిపోయాయి. నడుస్తున్న మరబొమ్మ అయిపోయింది. గుండెల్లో గుబులు, దిగులు శాశ్వత తిష్టవేశాయి. ఇదివరకు పిల్లలులేరన్న ఒక్క బాధే అయితే ఇప్పుడు దీప్తిని చూస్తూ అనుక్షణం అంతకు మించిన రంపపుకోతని అనుభవిస్తున్నారు.

దీప్తికి మెడ నిలవదు. కాళ్ళు చేతులు వంకర్లు తిప్పి పాకినట్టు చేస్తుంది. దీప్తి శరీరంలో అన్ని అవయవాలు పేరుకి మాత్రం ఉన్నాయి. కానీ ఏ అవయవమూ దాని పనిని సక్రమంగా నిర్వహించలేదు. దీప్తి 'మెంటల్లీ రిటార్డెడ్' అని డాక్టర్లు చెప్పినది విని సౌజన్యా, ప్రదీప్ జీవచ్ఛవాలయ్యారు. విధి ఎంత క్రూరంగా పరిహసిస్తుందో అర్థమయింది. దీప్తి ఇంటికి వచ్చి నాలుగేళ్ళవుతోంది. ఈ నాలుగేళ్ళు నాలుగు యుగాలు.. ఎన్నెన్ని అనుభవాలు... ఎన్నెన్ని చేదు సంఘటనలు.. ఎన్నెన్ని పరిహాలు.. ఎన్నెన్ని మాటల తూటాలు.. మేం చెప్తే వినలేదుగా బాగా శాస్తి అయింది అన్నట్టు వెక్కిరించకుండానే వెక్కిరింపులు ప్రదీప్ వైపు బంధువు

లంతా తమ పిల్లల్ని దత్తత దీసుకోనందుకు 'బాగా అయింది' అన్నట్టు శాడిజంతో హింసించారు.

"ఎంతమంది మన బంధువుల పిల్లలు లేరు.. ఎవర్నో ఒకర్ని తీసుకోండి అంటే వినలేదు. వెళ్ళి వెళ్ళి అనాధాశ్రమంలోంచి తెచ్చుకున్నారు బిడ్డని. ఇప్పుడేమయింది.. అనుభవిస్తున్నారు" అత్తగారి మాటల ఈటెలు సౌజన్య, ప్రదీప్‌ల పెళ్ళి సౌజన్యకి ఉన్న ఒక్క బాబాయి కుటుంబాన్ని దూరం చేస్తే ప్రదీప్ ఇంట్లోవాళ్ళు, బంధువులు రాకపోకలు సాగిస్తున్నా తమ నిరసనని చూపించే ఏ అవకాశమూ వదులుకోలేదు. రెండువైపుల నుంచీ వ్యతిరేకత.. ఎడాపెడా శాపనార్థాలు...

"నా కొడుకుని వెర్రివాణ్ణి చేసి కొంగున కట్టుకున్నావు.. ఇంతకంతా అనుభవిస్తావు.. ఇంత ఆస్తీ, అంతస్తూ అన్నీ చూస్తే ఎవరికైనా పుట్టుకొస్తుంది ప్రేమ.. ప్రేమట.. ప్రేమ... ఇంక ఎంత సుఖపడ్తావో చూస్తాగా.." అత్తగారు కొత్తకోడలికి ఆశీర్వచనాల బదులుగా పెట్టిన శాపనార్థాలు.

"తల్లీ.. ఓ సౌజన్యమ్మా.. కాస్త కాఫీనీళ్ళు పోస్తావా నా గొంతులో.. ఈ కొంపలో అడిగితే కానీ మంచి నీళ్ళు కూడా రావు." అత్తమ్మ సణుగుడు విని కాఫీ పెట్టడానికి లేచింది సౌజన్య.

"ఒరేయ్ అబ్బాయ్ కంటే ఖర్మకానీ.. పెంచుకుంటే ఏం ఖర్మరా.. ఆ దరిద్రాన్ని మళ్ళీ అనాధాశ్రమంలోనే వదిలేయండిరా. లేకపోతే ఏ హాస్పిటల్లోనో పడేయండి. డబ్బుపోతే పోతుంది.. మన వాళ్ళ పిల్లల్నెవరినైనా తెచ్చుకోవచ్చు." సాయంత్రం ప్రదీప్ రాగానే రాజమ్మ రోజూపాటే పాడింది. ప్రదీప్‌కి ఏం జవాబు చెప్పాలో ఎప్పట్లాగే అర్థంకాక వింటూ ఉండిపోయాడు. ఒక్కోసారి అమ్మ మాటలు సబబే అన్పిస్తాయి ప్రదీప్‌కి. కానీ సౌజన్య పొరపాటున కూడా తన మనస్సులోకి అటువంటి ఆలోచన రానివ్వదు. తను మాత్రం అలా చేయగలడా? దీప్తి తమ బిడ్డకాదు. రైటే.. కానీ తాము వెళ్ళి అందరి పిల్లల్లో ఏంచి 'దీప్తి'ని తెచ్చుకున్నారు. అంతమందిలో ఈ 'దీప్తి' ఎందుకు నచ్చింది? పరిశీలించి మరీ ఎన్నుకున్నారు. ఇదంతా 'విధి'యా? తలరాత అనుకోవాలా? ఆ పిల్ల బాధ్యత తాము తీసుకోవాలని దేవుడి నిర్ణయమా? తమని సంతోషంగా ఉంచడం దేవుడికి ఇష్టంలేదా? ఎందుకని ఇలా జరిగింది? అంతులేని ఆవేదన.. అనేకమైన ఆలోచనలు.. ప్రశ్నలూ సందేహాలు.. పాపని ఏ హాస్పిటల్లోనో, అనాధాశ్రమంలోనో ఇవ్వడానికి సౌజన్య మనస్సు ఎలా నిరాకరిస్తోందో అలాగే ప్రదీప్ కూడా అది పరిష్కారం కాదు అనే అనుకుంటున్నాడు. అందుకే సౌజన్య పాపతో మనశ్శాంతిగా ఉండే మార్గాన్ని అన్వేషిస్తూనే ఉన్నాడు. ఆ దారి కన్పించింది. అందుకే తల్లి మాటలు ఈరోజు అతన్ని ఎక్కువ ఇబ్బంది పెట్టడం లేదు.



"ఒరేయ్.. నీ పెళ్ళాం మరీ మొండికేస్తే ఆ పిల్లనీ, దాన్నీ విడిగా ఉంచు. డబ్బు పడేయ్.. వాళ్ళకోసం నీ ఆరోగ్యం పాడుచేసుకోకు. హాయిగా మళ్ళీ పెళ్ళి చేసుకో. అయినా లోపం దానిలోనేగా ఉంది.."

సౌజన్య కర్ణపుటాలకి అత్తగారి మాటలు విన్పిస్తున్నా ఆమెలో ఏ స్పందనా లేదు. దీప్తికి అందేటట్టు బొమ్మని ముందుకి తోస్తూ కూర్చుంది. ఈ డైలాగ్ రోజూ ఒకటి రెండుసార్లు ఆవిడ చెప్పడం.. ప్రదీప్‌కి వినడం అలవాటే. అందుకని ఏం మాట్లాడకుండా లేచి సౌజన్య, దీప్తి ఉన్న రూముపైపుకి నడిచాడు.

సర్దివున్న సూట్‌కేస్‌ల వంక ఆశ్చర్యంగా, అనుమానంగా చూశాడు.

"సౌజన్యా.. ఏంటిది?"

"మీ అమ్మగారు అన్నది సబబే.. మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి. నేను ఉష దగ్గరకి వెళ్తున్నాను దీప్తితో." తల వంచుకుని అంటున్న సౌజన్య నోరు మూశాడు ప్రదీప్. "నీ చేతిని ఏరి, కోరి పట్టుకున్నది విడవడానికి కాదు. అలాగే 'దీప్తి'ని ఈ ఇంటికి తెచ్చింది మళ్ళీ వెనక్కి ఇవ్వడానికీ కాదు. మనం ముగ్గురం మన జీవితం జీవిద్దాం. అందుకే ఇదుగో.." ప్రదీప్ అమెరికాలో తనకి జాబ్ వచ్చిన లెటర్ తీసి సౌజన్యకి చూపించాడు. సౌజన్య గాజుకళ్ళల్లో చాలా రోజుల తర్వాత.. చిన్న సంభ్రమం.. సంతోషం.. తడి చోటుచేసుకున్నాయి.

★